## • కొమురవెల్లి క్షేత్రం.. భక్తజన సంద్రం



సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎనిమిది వారాలపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా నాలుగో ఆదివారం మల్లన్న సన్నిధికి 35 వేల మంది భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వీఐపీ పాస్‌లు పక్కదారి పడుతున్నాయని గత వారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి స్పందించిన ఆలయవర్గాలు.. క్షేత్రంలో దర్శనం పాస్‌ల జారీ ప్రక్రియను కఠినతరం చేశాయి. దీంతో కౌంటర్ వద్ద రద్దీ లేకుండా పోయింది. –చేర్యాల

## మేడారం ట్రస్ట్ బోర్డు సభ్యుల ఖరారు

- చైర్మన్‌గా లచ్చుపటేల్
- జాబితాకు మంత్రి సీతక్క ఆమోదం
- త్వరలో వెలువడనున్న ఉత్తర్వులు

ములుగు, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర సందర్భంగా మేడారం ట్రస్ట్‌బోర్డు సభ్యులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఖరారు చేస్తూ జాబితాను దేవాదాయ శాఖకు పంపించారు. దేవాదాయ శాఖ ఆమోదం పొంది నేడో, రేపో ఉత్తర్వులు వెలువడనున్నాయి. ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా అరెం లచ్చుపటేల్‌తోపాటు మరో 13 మంది సభ్యులను నియమించనున్నారు. సభ్యులుగా ముంజాల భిక్షపతిగౌడ్, మిల్కూరి ఐలయ్య, కోడి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణసింగ్, సుంచ హైమావతి, చామర్తి కిశోర్, కోరం అబ్బయ్య, ఆలెం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామిని మంత్రి నియమించారు. అదేవిధంగా ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావును నియమించారు. దేవాదాయ శాఖ ద్వారా ఉత్తర్వులు వెలువడిన అనంతరం వీరంతా మేడారంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో పౌరహక్కుల నేత

- జగిత్యాల జిల్లా రేచపల్లిలో పోగుల రాజేశం అరెస్ట్




పోగుల రాజేశం

సారంగాపూర్, ఫిబ్రవరి 11: పౌరహక్కుల సంఘం నేత పోగుల రాజేశంను ఆదివారం ఛత్తీస్‌గఢ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు వాహనాల్లో మఫ్టీలో వచ్చిన పోలీసులు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లిలో అరెస్ట్ చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్సై తిరుపతిని సంప్రదించగా ఛత్తీస్‌గఢ్‌లో రాజేశంపై కేసు ఉన్నదని, ఈ నేపథ్యంలో కోర్టులో హాజరుపరిచేందుకే తీసుకెళ్లారని చెప్పారు. రాజేశం భార్య మల్లవ్వ మాట్లాడుతూ.. రెండు వాహనాల్లో 10 మంది వచ్చి తన భర్తను కొడుతూ తీసుకెళ్లారని ఆరోపించారు. తాను సైతం భర్త వెంట వాహనంలో వెళ్లగా బట్టుపల్లి వద్ద బలవంతంగా బయటకు దింపేశారని వాపోయారు. కొడుకుతో కలిసి ఫిర్యాదు చేసేందుకు జగిత్యాల డీఎస్పీ వద్దకు వెళ్లగా దంతేవాడలో నమోదైన కేసు విచారణ నిమిత్తం ఛత్తీస్‌గఢ్ పోలీసులు తీసుకెళ్లినట్టు చెప్పారని మల్లవ్వ పేర్కొన్నారు.

# ఐసీయూలో రోగిని కరిచిన ఎలుక

- కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో ఘటన
- విచారణ చేపట్టిన వైద్యా విధాన పరిషత్ కమిషనర్
- ముగ్గురి సస్పెన్షన్.. సూపరింటెండెంట్ సరెండర్
- వైద్యుల సస్పెన్షన్‌పై భగ్గుమన్న టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్



నిజామాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో అమానవీయ ఘటన చోటుచేసుకున్నది. మెదడుకు సంబంధించిన సమస్యతో చికిత్స పొందుతున్న కామారెడ్డి వాస్తవ్యుడు ముజీబుద్దీన్‌ను శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఎలుక కరిచింది. చేతి వేళ్లు, కాళ్లను ఎలుక కొరకడంతో గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెంటనే స్పందించి వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను విచారణకు ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి హుటాహుటిన వచ్చిన అజయ్ కుమార్ నేరుగా కామారెడ్డిలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లి పరిశీలించారు. ఐసీయూ వార్డులో రోగి చికిత్స పొందుతున్న వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎలుక కరిచిన ఆనవాళ్లను, ఎలుకలు ఐసీయూ వార్డులోకి ఎలా వచ్చాయని ఆరా తీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దంటూ సిబ్బందిని హెచ్చరించారు. బాధితుడి భార్యతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించి స్థానికంగానే మీడియాకు వివరాలను వెల్లడించారు. ఇందులో ఆయన చెప్పిన మాటలు విస్తూ గొల్పుతున్నాయి. వారం రోజులుగా బాధితుడు కోమాలోనే ఉన్నారు. స్పృహలో కూడా లేరని చెప్పారు. ఐసీయూ వార్డులోకి ఎలుకలు రావడానికి స్థానికంగా జరుగుతున్న నిర్మాణ పనులు, రోగి బంధువులు తిని పడేసిన అన్నం మెతుకులే కారణమని చెప్పారు. దవాఖాన సిబ్బంది నిర్లక్ష్యాన్ని రోగులకు ఆపాదిస్తూ వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఇచ్చిన వివరణకు అందరూ ఆశ్చర్యపోయారు.

### నలుగురిపై చర్యలు..

రోగిని ఎలుక కరిచిన ఘటనపై కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ప్రభుత్వానికి నివేదిక పంపించగా.. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ త్రివేణి నలుగురిపై చర్యలు తీసుకున్నారు. వైద్యురాలు కావ్య, ఇన్‌చార్జి జనరల్ మెడిసిన్ వైద్యుడు సంపత్‌కుమార్, స్టాఫ్‌నర్స్ మంజులను సస్పెండ్ చేయగా,సూపరింటెండెంట్ విజయలక్ష్మిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు.

## 24 గంటల్లో వైద్యులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా సమ్మె
- టీచింగ్ గవర్నమెంటు డాక్టర్స్ అసోసియేషన్ హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ)/సుల్తాన్‌బజార్: కామారెడ్డిలో రోగిని ఎలుకలు కరిచిన వ్యవహారంలో డీఎంఈ విభాగ డాక్టర్లను సస్పెండ్ చేయడంపై తెలంగాణ టీచింగ్ గవర్నమెంటు డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. పేషెంట్‌కు వైద్యం చేయడం వరకే డాక్టర్ల బాధ్యత అని.. దవాఖానలో ఎలుకలు ఉండకుండా చూడటం శానిటేషన్ సిబ్బంది, సంబంధిత అధికారుల బాధ్యత అని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్లపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని, లేకపోతే రాష్ట్రంలో ఉన్న టీచింగ్ వైద్యులంతా సమ్మెకు సిద్ధమవుతారని హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కళాశాలల్లో వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని తెలిపారు. 24 గంటల్లో సస్పెన్షన్ ఎత్తివేయకపోతే 'చలో డీఎంఈ' ప్రకటిస్తామని హెచ్చరించారు. గాంధీ దవాఖానలో 9వ తేదీ నుంచి కేఎన్‌ఆర్ వర్సిటీ తరఫున జనరల్ మెడిసిన్ ఎగ్జామినర్‌గా డ్యూటీలో ఉన్న డాక్టర్ వసంత్‌ను ఎలా సస్పెండ్ చేస్తారని టీటీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతి రావు ప్రశ్నించారు.

# 'మహిళలపై ట్రోలింగ్'ను అరికట్టాలి

- ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక ప్రధాన కార్యదర్శి మల్లీశ్వరి




మాట్లాడుతున్న ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రధాన కార్యదర్శి మల్లీశ్వరి

ఖమ్మం, ఫిబ్రవరి 11: మహిళలపై జరుగుతున్న ట్రోలింగ్‌ను అరికట్టేందుకు ప్రజాస్వామికవాదులు, లౌకికవాద శక్తులంతా ఒక్కటై ఉద్యమించాలని ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక (ప్రరవే) ప్రధాన కార్యదర్శి, రచయిత్రి మల్లీశ్వరి పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలోని వేదిక కల్యాణ మండపంలో ప్రరవే ఏడో మహాసభల్లో భాగంగా రెండోరోజు ఆదివారం 'మహిళలపై ట్రోలింగ్' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజంలో ప్రస్తుత పరిణామాలను గమనిస్తూ, వాటిని విశ్లేషిస్తూ ప్రరవే అక్షరబద్ధం చేస్తున్నదని అన్నారు. సోషలిస్ట్ భావాలు ఉన్న వారు కూడా మహిళలను ట్రోలింగ్ చేయడం దారుణమని అన్నారు. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. వాస్తవాలను మాట్లాడే వారిని కొందరు పనిగట్టుకుని మరీ ట్రోలింగ్ చేస్తున్నారని తెలిపారు. ప్రజాగాయని విమలక్క మాట్లాడుతూ.. ట్రోలింగ్‌ను ఎదుర్కోవాలంటే ప్రజాస్వామిక వాదలంతా ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. ప్రరవే జాతీయ కోశాధికారి రామలక్ష్మి సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. తర్వాత రచయిత్రి కాత్యాయనీ విద్మహే రచించిన నవలను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయిత్రులు శిలాలోలిత, శీలా సుభద్రాదేవి, ఎండ్లూరి మానస తులసి చందు, మెర్సీ మార్గరెట్, స్వేచ్ఛ, అరుణ గోగులమండ, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్, యాంకర్ ఉదయ భాను, హేతువాది బైరి నరేశ్ పాల్గొన్నారు.

# 3 కోట్ల పరిహారం నొక్కేందుకు భారీ స్కెచ్

- మిడ్‌మానేరు పరిహారానికి కొందరు నాయకులు, పలువురు అధికారుల ఎత్తులు
- వరదవెల్లి గ్రామం మునిగినట్టు బైనంబర్లతో తప్పడు పత్రాల సృష్టి
- కదిలిన దస్త్రాలు.. సిద్ధమైన చెక్కులు
- నిర్వాసితుల ఫిర్యాదుతో గుట్టురట్టు

బోయినపల్లి, ఫిబ్రవరి 11: ప్రాజెక్టులో ఇండ్లు మునిగిపోకుండానే, అసలు అక్కడ ఆ నంబర్‌తో ఇండ్లు లేకుండానే మాధ్యమానేరు ప్రాజెక్టు ముంపు పరిహారం కోసం కొందరు నాయకులు, పలువురు అధికారులు చేసిన భారీ కుంభకోణం ఆలస్యంగా బయటపడింది. అప్పనంగా రూ.3 కోట్లు కాజేసేందుకు భారీ స్కెచ్ వేయడం, చెక్కులు కూడా రెడీకావడం, చివరి నిమిషంలో ఆ గ్రామ నిర్వాసితులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ప్రక్రియ నిలిచిపోయింది. వివరాలిలా.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ ఎస్‌ఆర్‌ఆర్ జలాశయం నిర్మాణంలో 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అందులో వరదవెల్లి గ్రామం కూడా మునిగిపోయింది. ఆ గ్రామంలో ఇండ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు గత ప్రభుత్వమే పరిహారం చెల్లించింది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు కూడా నిర్మించి ఇచ్చింది. ఈ క్రమంలో అవినీతి అక్రమాలకు మరిగిన కొందరు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు కలిసి అడ్డదారిలో పరిహారం కొట్టేయాలని ప్లాన్ వేశారు. ఇదే గ్రామంలో ముంపునకు గురై పరిహారం పొందిన తొమ్మిది ఇండ్లకు బై నంబర్లు (ఇంటి నంబర్లు) వేసి రూ.3 కోట్లు కాజేసేందుకు పెద్ద ప్రణాళిక వేశారు. అందరూ కలిసి సంయుక్తంగా తప్పుడు ధ్రువ పత్రాలు, బోగస్ ఇంటి నంబర్లు, తప్పుడు రికార్డులు తయారు చేశారు. దస్త్రాలు కూడా సిద్ధం చేశారు. పరిహారం పంపిణీకి అధికారులు చెక్కులు కూడా రాసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ విషయం గ్రామస్థులకు తెలియడంతో వారు వేములవాడ ఆర్డీవోకు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు గత నెల 25న ఫిర్యాదు చేయడంతో ప్రక్రియ నిలిచిపోయినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అక్రమ బాగోతంపై ఇంటెలిజెన్స్ అధికారులు, ఇతర అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి సమగ్ర నివేదిక కలెక్టర్‌కు ఇచ్చినట్టు తెలిసింది. ఇందులో మూడు శాఖల అధికారులు పాత్ర ఉండగా, కేవలం పంచాయతీ రాజ్ శాఖలో రిటైర్డ్ అయిన ఓ ఉన్నతాధికారిపై చర్యలకు సిఫారసు చేసినట్టు సమాచారం. గ్రామస్థుల ఫిర్యాదుతో చెక్కులు నిలిచిపోగా, నియోజకవర్గంలోని ఓ నేత పరిహారం చెక్కులు పంపిణీ చేయాలని అధికారులకు ఫోన్‌చేసి చెప్పినట్టు తెలిసింది. ఈ విషయమై డీపీవో రవీందర్‌ను వివరణ కోరగా, వరదవెల్లిలో ముంపునకు గురైన ఇండ్లు, తదితర వివరాలను క్షేత్ర స్థాయిలో రికార్డులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక పంపినట్టు తెలిపారు.

## • 'యాన్ ఇన్వాల్యుబుల్ ఇన్నొవేషన్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి. చిత్రంలో శ్రీనాథాచారి

పాలమూరు, ఫిబ్రవరి 11: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రసిద్ధ రచయిత, లిమ్కా, గిన్నిస్ వరల్డ్ రికార్డుల గ్రహీత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి రచించిన 'యాన్ ఇన్వాల్యుబుల్ ఇన్నొవేషన్' పుస్తకాన్ని మహబూబ్‌నగర్ జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనాథాచారి మాట్లాడుతూ.. 30 ఏండ్ల అనుభవం, మూడేండ్ల కఠోర దీక్షతో ఈ పుస్తకాన్ని రచించినట్టు తెలిపారు. పుస్తకం ధర రూ.5 కోట్లు అని, ఈ పుస్తకాన్ని అమ్మగా వచ్చిన డబ్బులలో ఐక్యరాజ్యసమితికి 50 శాతం, దేశానికి 25 శాతం, తెలంగాణకు 25 శాతం చెల్లిస్తానని తెలిపారు. ఇందులో పది విభాగాలుగా.. 197 దేశాల్లోని సమస్యలపై 237 కవితలు రాసినట్టు చెప్పారు. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుస్తకమని, త్వరలోనే దీనిని అందరికీ అందుబాటులోకి తీసుకొస్తానని పేర్కొన్నారు. ఈ పుస్తకం గిన్నిస్ రికార్డు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనాథాచారిని మొమెంటో, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.